పల్లెలకు పైసలొచ్చినయ్



- పంచాయతీలకు కాస్తంత ప్రాణం పోసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా జీపీలకు రూ.20కోట్లపైచిలుకు మంజూరు
- జనాభా ఆధారంగా కేటాయింపు
- ఒకట్రెండురోజుల్లో ఖాతాల్లో జమ
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు వినియోగించాలని సూచన

హనుమకొండ టౌన్, అక్టోబరు 8: నిధులు లేమితో తల్లడిల్లుతున్న పల్లెలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి ప్రాణం పోసింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల ఖాతాలో చెక్కులు పడగా ఒకటి రెండు రోజుల్లో ఆ నిధులు మంజూరు కానున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ జిల్లాల గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు మోక్షం కలగనుంది. అయితే ఈ నిధులను గ్రామ పంచాయతీ కార్మికులతో పాటు వాహనాల ఈఎంఐ, 'స్వచ్ఛదనం- పచ్ఛదనం'కు వినియోగించాలని సర్కారు షరతు విధించింది.

చాలా రోజులకు..

కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ నిధులు నిలిపివేసినప్పటి నుంచి పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. దానికి తోడు పంచాయతీల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో ఇంటికి పెద్ద దిక్కు లేకుండాపోయింది. అప్పటి నుంచి పల్లెల బాగోగులు పట్టించుకునే నాథులు లేకుండాపోయారు. దీంతో పల్లెల్లో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. పల్లె అభివృద్ధి భారమంతా కార్యదర్శులపై పడడంతో వారికి తలకు మించిన భారమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు సుమారు రూ.20 కోట్లు పైచిలుకు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

జనాభా ఆధారంగా నిధులు

ఆగస్టు 5న 'స్వచ్ఛదనం - పచ్ఛదనం' పేరుతో ఐదు రోజుల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్యక్రమ నిర్వహణకు మాత్రం ఎలాంటి నిధులు ఇవ్వకుండా కార్యదర్శులు జేబులో నుంచి ఖర్చు పెట్టాలని ఆదేశించింది. చేసేదేమీ లేక స్వతహాగా ఖర్చుచేసి ఐదు రోజుల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఖర్చును ఇప్పుడు ప్రభుత్వం ఆయా గ్రామ పంచాయతీలకు జనాభా ఆధారంగా అందజేస్తుంది. 3వేల వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50,000, 3 వేల నుంచి 8వేల వరకు ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.75,000, 8 వేలకు పైగా ఉన్న పంచాయతీలకు రూ.లక్ష చొప్పున

మిగతా 10వ పేజీలో..

బుగులోని ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, అక్టోబరు 8: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంతోపాటు బుగులోని వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలో బుగులోని వెంకటేశ్వరస్వామి జాతరను చేరుకోవడానికి ఉపయోగపడే నాలుగురోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్ల 41 లక్షలు మంజూరు కాగా ఆ పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ బుగులోని గుట్టపైకి వెళ్లే మెట్ల పునరుద్ధరణకు రూ. 2 లక్షలతో పనులు చేపడతామని అన్నారు. బుగులోని జాతర నాటికి ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. బుగులోని వెంకన్న, కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆశీర్వాదంతోనే తాను ఎమ్మెల్యేగా విజయం సాధించానని, ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, కాంగ్రెస్ నాయకులు ఎస్.సంపత్‌రావు, బాబూరావు, మటిక సంతోష్, పాతుపల్లి సంతోష్, వీరబ్రహ్మం, వావిలాల రమేష్, నిమ్మల విజేందర్, రమణారెడ్డి, గైకోటి రవి తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ ఐటీ

ఇంటర్వ్యూ INTERVIEW



- ఏఐ రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- మంథని, కాటారంలో పారిశ్రామిక పార్కులు
- ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఉపాధి అవకాశాలు
- ప్రజలకిచ్చిన హామీలన్నింటికీ సర్కారు కట్టుబడి ఉంది
- మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వివరాలు 10లో..

విషజ్వరంతో యువకుడి మృతి



కృష్ణసాయి (ఫైల్)

ములుగు, అక్టోబరు 8: విషజ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలం చిన్నగుంటూరుపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పార్నందుల సునీత-బాలరాజు దంపతుల కుమారుడు కృష్ణసాయి(25) పదిరోజులుగా విషజ్వరంతో బాధపడుతున్నాడు. ములుగులో వైద్యం చేయించినా తగ్గకపోవడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో కృష్ణసాయి మృతిచెందాడు.

పాముకాటుతో రైతు కన్నుమూత



సాంబయ్య (ఫైల్)

ములుగు, అక్టోబరు 8: పాముకాటుతో రైతు మృతి చెందిన సంఘటన ములుగు మండలం అబ్బాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాపురం గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య(55) తాను సాగు చేస్తున్న మిర్చితోటలో గుంటుక కొడుతుండగా పాము కాటేసింది. దీంతో అతడు గట్టిగా అరవడంతో పక్క చేనులో పనిచేస్తున్న రైతులు పరుగున వచ్చారు. తీవ్ర అస్వస్థతకు సాంబయ్యను ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సాంబయ్యకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే..

9లో..

అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్ నాగపురి రమేష్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకల్లో వెల్లడి

బతుకమ్మ, దసరా వేడుకలకు ఏర్పాట్లు



అంబేద్కర్ క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్లు, అధికారులు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 8: భూపాలపల్లి పట్టణ పరిధిలో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మునిసిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పనులు ప్రారంభించారు. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో పనులు జరగ్గా కౌన్సిలర్లు ముంజాల రవీందర్, దాట్ల శ్రీనివాస్, మురళీధర్ హాజరయ్యారు. సద్దుల బతుకమ్మ వేడుకలు అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహించేందుకు సహకరించాలని సింగరేణి జీఎం హబీబ్‌హుస్సేన్‌కు మునిసిపల్ కమిషనర్ లేఖ అందించారు. అలాగే దసరా సందర్భంగా రావణవధ కార్యక్రమాన్ని సైతం అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ రాజేశ్వర్ తెలిపారు. ఈ మేరకు పాలకవర్గం సమావేశం నిర్వహించి తీర్మానించినట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి చెప్పారు.

న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్, అక్టోబరు 8: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబరు 16 నుంచి జరగాల్సిన న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షలను గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన పరీక్షల్లో ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు ఆరో సెమిస్టర్ అలాగే ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలున్నాయని వివరించారు.

సత్తెమ్మ పాట.. రాగాల పూదోట..

కష్టసుఖాల దొంతరలే ఆమె పాటలకు రూపం

ఆకాశవాణిలో ఆలపించిన బతుకమ్మ పాటలు

ఆడియో క్యాసెట్లుగా రూపాంతరం

లింగాలఘణపురం, అక్టోబరు 8:సాహిత్య లోకమెరుగని కళాపిపాసి ఆమె.. ఆమె కైకట్టి పాడే ప్రతీ పాట లక్షల ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సుస్వరాలు ఎరుగకపోయినా.. అక్షరం ముక్క నేర్వక పోయినా.. బడుగుల కష్టాలను ఒక్కటిగా పోగు చేసినట్టు.. జనజీవన శ్రమైకంలో చిందించే చెమట చుక్కలు రాశులుగా పేర్చినట్టు.. అభాగ్యుల కన్నీటి ధారలను ఒడిసిపట్టి బతుకమ్మ పాట రూపంలో బడుగులకు బతుకు నేర్పుతుంది. జీవితంలో ఎదురయ్యే కష్టం.. సుఖం.. మనోల్లాసానికి ఉపయుక్తమయ్యే ఆటలు.. పాటలు.. ఇలా అన్నీ కలబోసి ఆమె నోట వెలువడే బతుకమ్మ పాట బడుగుల బతుకులకు కొత్త ఊపిరిలూదుతోంది. కనుమరుగవుతున్న సాంస్కృతిక సంరంభాన్ని నాలుగు బాటల వద్ద నిటారుగా నిలబెట్టినట్టు పాడే ఆమె ఉయ్యాల పాట బతుకు భరోసాకు సరికొత్త ఊటగా ఉత్సాహాన్నిస్తుంది. ఆమె కంఠం ఓ ఘంటానాథం.. రాగరంజితాన్ని రంగరించుకున్న ఆమె పాట సెలయేటి ఊటై బడుగుల బతుకులకు భాష్యం నేర్పుతోంది. ఆమే.. లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కడకంచి సత్తెమ్మ ఉరఫ్ ఉయ్యాల పాటల సత్తెమ్మ. సత్తెమ్మ రాగం పల్లె బతుకుల జీవన గానం.. కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలకు పునరుజ్జీవం పోస్తున్న కళాతపస్వి ఆమె. గడిచిన 60 ఏళ్లుగా నవతరానికి బతుకమ్మ పాటలను నేర్పుతూ బతుకు భాష్యానికి నాందిగా.. సంస్కృతీ సాంప్రదాయాలకు దిక్సూచిగా నిలుస్తోంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయల వైభవం.. బతుకమ్మ వేడుకల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. సత్తెమ్మ గళమెత్తిందంటే చాలు ఇంటి ముంగిళ్లలో గుసగుసలాడే అతివలంతా ఆమె దరికి చేరాల్సిందే. అలా వచ్చిన వాళ్లంతా ఆమె పాటకు వంతపాటాడాల్సిందే. అదే సత్తెమ్మ ప్రత్యేకత.

కన్నీటి కష్టాలే.. బతుకమ్మ పాటలుగా..

అక్షరజ్ఞానం అసలే ఎరుగని సత్తెమ్మ తన చుట్టూ నిత్యం ఎదుర్కొంటున్న కష్టాలను.. తోటి వారు ఎదుర్కొంటున్న బాధలను తన జీవితంలో ఎదురైన ఇబ్బందుల సారాన్ని పాటల రూపంలో మలచడం సత్తెమ్మ ప్రత్యేకత. ప్రతీ ఏటా స్వగ్రామం నెల్లుట్లలో మహాలయామావాస్య రోజు జరిగే ఎంగిలి బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ దాకా సత్తెమ్మతో పాటలను పాడించుకునేందుకు స్థానికులు ఉవ్విళ్లూరుతుంటారు.

ఎల్లలు దాటిన.. సత్తెమ్మ పాటలు..

బతుకమ్మ పాటలతో పరిచయమైన సత్తెమ్మ తన పాటల తూటాలను వరంగల్ ఆకాశవాణిలో ఉర్రూతలూగించింది. అంతటితో ఆగకుండా తన పాటల ప్రవాహాన్ని ఒగ్గు కళాసామ్రాట్ చుక్క సత్తయ్య, బుగ్గ మల్లయ్య ప్రోత్సాహంతో ఆడియో రికార్డింగ్‌ను కూడా చేయించారు. ఒంగూరి మల్లేశ్‌యాదవ్ నిర్మాణంలో బతుకమ్మ పాటలతో పాటుగా రేణుకా ఎల్లమ్మ, సమ్మక్క సారలమ్మ, మాంధాత, పార్వతీ, బీరప్ప, పెద్దిరాజు, గంగురాజు, శ్రీదేవి, వన్నెల అక్కమ్మ, మల్లన్న, వేములవాడ రాజన్నకు చెందిన పురాణ కథలను అనర్గలంగా చెబుతూ సత్తెమ్మ తన



ప్రావీణ్యాన్ని వేనోళ్ల చాటుతోంది. సత్తెమ్మ పాడిన ఉయ్యాల పాటలు, బతుకమ్మ పాటలు క్యాసెట్లు, సీడీల రూపంలో తయారై ఎంతో మందికి సాంస్కృతిక సంబరాన్ని పంచిస్తోంది. తెలంగాణ స్వరాష్ట్రంలో బతుకమ్మ పాటలకు విశేష ఆదరణ లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తుంది.

20వ ఏట నుంచి పాటల తూటాగా ఎదిగి..

సత్తెమ్మ తన 20వ ఏట నుంచే పాటల తూటగా ఎదిగింది. ప్రస్తుతం 80 ఏళ్ల వయసున్న సత్తెమ్మ గళం ఇప్పటికీ ఓ ఘంటారావమై మారుమ్రోగుతుంది. వయసు మీదపడ్డా తన కంఠంలో పదును ఏమాత్రం తగ్గలేదని, ఏటేటా పాటల సవ్వడిలో నిత్యనూతనమే నంటూ నిరూపిస్తుంది. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన సత్తెమ్మకు చిన్నతనంలో 10వ ఏటలోనే నెల్లుట్లకు చెందిన కడకంచి బీరయ్యతో బాల్యవివాహం జరిగింది. పెళ్లైన 10 ఏళ్ల తర్వాత తన పాటకు పదును పెట్టి 60 ఏళ్లుగా వెనకకు తిరగకుండా బతుకమ్మ పాటలకు జీవంపోస్తుండటం గమనార్హం.

> అడవుల్లో పుట్టినావా గౌరమ్మా..
> ఆకుల్లో పెరిగినావా గౌరమ్మ..
> నిండు అమాసనాడూ గౌరమ్మా..
> మా ఇంటికొచ్చినావా గౌరమ్మ..
> పూవుల్ల పూజిద్దునా గౌరమ్మా..
> గంధాన కరిగిద్దునా గౌరమ్మ..
> తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
> తీగమల్లెలు తెచ్చి.. నాగ మల్లెలు తెచ్చి..
> నాగమల్లెలు తెద్దునా గౌరమ్మా..
> నిన్నే పూజిద్దునా గౌరమ్మ..
> బ్రాహ్మణులను పిలుపిద్దునా గౌరమ్మా..
> అక్షింతలు వేయిద్దునా గౌరమ్మ..
> అద్దమడుగు నెయ్యి.. ఆవునేతి బొట్టు..
> నేతిలో కరిగిద్దునా గౌరమ్మా..
> మల్లెల్లో పూజిద్దునా గౌరమ్మ..
> ఎన్నెన్నో పూజలు మెప్పుగా జేయించి..
> గొప్పగా జేయిద్దునా గౌరమ్మా..
> గంగలో ఒదిలొద్దునా గౌరమ్మ

డ్యూటీ మీట్ పోటీలతో వృత్తి నైపుణ్యం పెరుగుతుంది..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, అక్టోబర్ 8: డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోలీసు అధికారులు తమ వృత్తిలో మరింత రాణించొచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మూడురోజుల పాటు కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ పోలీసు డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీసు అధికారులకు సీపీ మంగళవారం పతకాలను బహూకరించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్న జోనల్ స్థాయి డ్యూటీ మీట్ ఈనెల 3వతేదీ నుంచి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. అధికారులు రోజువారిగా నిర్వహించే విధులకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి సీపీ చేతుల మీదుగా పతకాలు అందచేశారు. విజేతలు ఈనెలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నురస్థులను గుర్తించడం సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



విజయం సాధించిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

అభ్యర్థుల్లేక ఆగిన పోస్టులు 59

నేడు హైదరాబాద్‌కు కొత్త టీచర్ల పయనం

ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 8: డీఎస్సీ-2024 నియామకాల ప్రక్రియ ఎట్టకేలకు ముగియనుంది. ఈ నెల 3 నుంచి 5 వరకు 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించగా, మంగళవారం ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలను సంబంధిత డీఈవోలు వారి కార్యాలయ వెబ్‌సైట్లలో పొందుపరిచారు. అయితే రెండు జిల్లాల్లో 488 పోస్టులు భర్తీ కానున్నాయని ముందుగా ప్రకటించినప్పటికీ సంబంధిత కేటగిరీల్లో అభ్యర్థులు లేకపోవడంతో 59 పోస్టులు మళ్లీ ఖాళీగానే దర్శనమీయనున్నాయి.

వరంగల్ జిల్లాలో 17 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీలుగానే ఉంచారు. అలాగే వివిధ కేటగిరీల్లో అభ్యర్థులు లేక 21 పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మిగిలాయి. కాగా, జిల్లాలో మొత్తం 301 పోస్టులకుగాను 38 పోస్టులు ఖాళీలుగానే మిలిగిపోయాయి. ఇక హనుమకొండ జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ గల అభ్యర్థులు లేకపోవడంతో 12 పోస్టులు ఖాళీలుగానే మిగలగా, ఎస్టీల్లో సంబంధిత కేటగిరీల్లో 6 పోస్టులకు సంబంధిత క్వాలిఫికేషన్ అభ్యర్థులు లేకపోవడంతో అవి బ్యాక్‌లాగ్ పోస్టులుగా మిగిలిపోనున్నాయి. మొత్తంగా జిల్లాలో 187 పోస్టులకు 18 పోస్టులు ఖాళీగానే మిగలనున్నాయి. కాగా, కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కొత్తగా ఎంపికైన అభ్యర్థులను బస్సుల్లో హైదరాబాద్ తరలించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నుంచి వారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

డైట్ బకాయిలు చెల్లించండి

బోధన ఆస్పత్రుల డైట్ కాంట్రాక్టర్ల మొర



వరంగల్ మెడికల్, అక్టోబరు 8: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బోధన ఆస్పత్రులలో డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల కాలంగా నిధులు విడుదల చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి బిల్లులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ ఆరు నెలలకు పైగా గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రూ.3 కోట్లు, వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో రూ.36లక్షలు, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రూ.33లక్షలు, టీబీ ఆస్పత్రిలో రూ.15లక్షలు, వరంగల్ కంటి ఆస్పత్రిలో రూ.15లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని డైట్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వద్ద పనిచేసే ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని, దసరా, దీపావళి పండుగలు ఉన్న నేపథ్యంలో బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు.

నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించిన యువకుడు



మాలోత్ సుకుమార్

పర్వతగిరి, అక్టోబరు 8: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ గ్రామశివారు బాజుతండాకు చెందిన మాలోత్ సుకుమార్ అనే యువకుడు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. బాజుతండాకు చెందిన మాలోత్ శేర్యా- పతాని దంపతులకు ఒక కూతురు రజిత, ఇద్దరు కుమారులు రాము, సుకుమార్ ఉన్నారు. రజితకు వివాహం కాగా, పెద్దకుమారుడు రాము డిగ్రీ పూర్తిచేసి తండాలో తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడుగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు సుకుమార్ ఎన్ఐటీ వరంగల్‌లో 2021లో ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగప్రయత్నాల్లో భాగంగా పలు పోటీపరీక్షలు రాశాడు. ఏకంగా నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. స్టాఫ్‌సెలక్షన్ కమిషన్(ఎస్సెస్సీ)లో జూనియర్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు ఎంపికయ్యారు. నాలుగు పోస్టులకు అర్హత సాధించగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఉద్యోగంలో చేరి సేవలందించడానికి గాను సుకుమార్ సుముఖతను వ్యక్తం చేశారు. తమ కుమారుడు ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించడంతో ఇటు తల్లిదండ్రులతో పాటు అటు తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

పేదరికం అడ్డురాలే.. వైకల్యంతో కుంగిపోలే..

క్రీడాకారులు దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి

అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్ నాగపురి రమేష్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ముగింపు వేడుకల్లో వెల్లడి

వరంగల్ స్పోర్ట్స్ అక్టోబరు 8: చాలామంది తమలో ఉన్న చిన్న చిన్న లోపాలకే కుంగిపోతూ వైకల్యం ఉంటే ఏదీ సాధించలేమనే భావనతో ఉన్నవారికి జీవంజి దీప్తి స్ఫూర్తిగా నిలిచారని అథ్లెటిక్స్ ఇండియా చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ కొనియాడారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌పై రెండు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర అమ్మాయిలా మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు దీప్తిని హేళన చేయడంతో ఆమె కుంగిపోకుండా మొక్కవోని దీక్షతో పారాలింపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించడంతో నేడు తనతో ఫొటోలు దిగేందుకు ఉత్సాహాన్ని కనబరుస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన పారాలింపిక్స్‌లో కల్లెడకు చెందిన జీవంజి దీప్తికి తెలుగురాష్ట్రాల్లో కాంస్య పతకం సాధించిన ఘనత దక్కిందన్నారు. తన దగ్గర అథ్లెటిక్స్‌లో తర్ఫీదు పొందుతూ ఒలంపిక్స్‌లో దీప్తి కాంస్య పతకం సాధించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పారాలింపిక్స్ కాంస్య పతక విజేత జీవంజి దీప్తి మాట్లాడుతూ.. ఒలంపిక్స్‌లో పతకం సాధించడం కోసం ఆహర్నిషలు కష్టపడుతూ కోచ్ నాగపురి రమేష్ సలహాలు సూచనలతో కాంస్య పతకం సాధించానన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అండర్ -14, 16, 18, 20 బాల బాలికల విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో సుమారు 1,100 మంది క్రీడాకారులు, 100 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. 100, 400, 600, 3000, 10,000 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, స్టీపుల్‌చేజ్, 110 మీటర్ల హర్డిల్స్, 4ఇంటు 400 మిడ్ రిలే, త్రయాత్లేన్, పోల్‌వాల్ట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌వో జి.అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గట్టు మహేష్‌గౌడ్‌బాబు, ములుగు జిల్లా అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్, నారాయణపేట జిల్లాల కార్యదర్శులు రాజాగౌడ్, రమణ, పీడీలు రజినీకాంత్, మనోజ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, టెక్నికల్ అఫిషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హోరాహోరీగా పోరు

అథ్లెటిక్స్ ఫైనల్ ఈవెంట్లు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తమ సత్తా చాటుకున్నారు. 100 మీటరు, 3000 మీటర్లు, హర్డిల్స్ స్టీపుల్ చేజ్ పోటీల్లో ఒకరికి మించి ఒకరు గెలవాలని సంకల్పంతో ఎండ వేడిమిని లెక్కచేయకుండా అనుకున్న లక్ష్యంవైపు పరుగులు తీశారు. రెండో రోజు నిర్వహించిన ఫైనల్స్ అండర్-18 బాలుర 100మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం గణేష్ (నల్లగొండ), ద్వితీయ స్థానం ఎస్.హర్షవర్ధన్ (రంగారెడ్డి), తృతీయ స్థానం కె.అశోక్ (ఖమ్మం) సాధించారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానం షేక్ సుహాని (హైదరాబాద్), ద్వితీయ స్థానం ఎం.అక్షిత (రంగారెడ్డి), తృతీయ స్థానం అమ్మ అంజుం (మంచిర్యాల) సాధించారు. అండర్- 20 బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం ఎస్.ప్రవళిక(నల్లగొండ), ద్వితీయ స్థానం రాగవర్షిని(హైదరాబాద్), తృతీయ స్థానం ఎం.శృతి(నాగర్‌కర్నూల్) పొందారు. అండర్-20 బాలుర జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం కె.స్వామి, ద్వితీయ స్థానం పి.నగేష్, తృతీయ స్థానం ఆర్.తరుణ్‌కుమార్ సాధించారు.



అండర్‌20 బాలుర పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
బుధవారం 9 అక్టోబరు 2024 10

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ 'ఐటీ'

- ఏఐ రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- మంథని, కాటారంలో పారిశ్రామిక పార్కులు
- ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఉపాధి
- ప్రజలకిచ్చిన హామీలన్నింటికీ సర్కారు కట్టుబడి ఉంది
- మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి)

కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం పరిశ్రమల కోసం ప్రత్యేక పాలసీని తీసుకొచ్చి పెట్టుబడులను ఆకర్షించడానికి కృషిచేస్తోందని, పలు ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సైతం ఐటీ పరిశ్రమలను ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలైన సందర్భంగా మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా ము చ్చటించిన ఆయన పలు అంశాలను వెల్లడించారు. ప్రస్తుతం విస్తృతంగా అత్యంత ఆధునిక సాంకేతిక రంగమైన ఆర్టిఫిషియల్ ఇంటిలీజెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆ రంగ అభివృద్ధి కోసం పని చేస్తోందని, అలాగే వ్యవసాయరంగాన్ని పటిష్ఠం చేసి వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయనున్నట్టు వెల్లడించారు. మంథని, కాటారం కేంద్రాలుగా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు పక్కా కార్యాచరణతో ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు, మహిళాసాధికారతకు ప్రభు త్వం కట్టుబడిఉందన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా వివిధ రకాల ఉత్పత్తులను మార్కెట్‌కు అనుసంధానించే కార్యక్ర మాలు చేపట్టి లక్షలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. తమ కుటుంబానికి ఎనిమిదిసార్లు అవకాశమిచ్చి రాష్ట్రాభివృద్ధిలో పాలుపంచు కోవ డాని కి గెలిపించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ నియో జకవర్గ సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి: మంథని నియోజకవర్గంపై మీ ముద్ర?

మంత్రి: మంథని నియోజకవర్గ ప్రజలే మా కుటుంబం. ఈ నియోజకవర్గం నుంచి నాన్న దుద్దిళ్ల శ్రీపాదరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఉమ్మడి ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన తదనంతరం రాజకీయాల్లోకి వచ్చిన నేను ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నా. ప్రజలు నన్ను ఐదుసార్లు గెలిపించి అసెంబ్లీకి పంపించారు. వారి నమ్మకాన్ని



వమ్ము చేయకుండా నిస్వార్థంగా సేవ చేస్తూ నిత్యం వారికి అందుబా టులో ఉండేందుకు కృషి చేస్తున్నాను. అలాగే నాడు ఉమ్మడి ఏపీలో ఇప్పుడు స్వరాష్ట్రంలో మంత్రిగా పనిచేయడం సంతోషంగా ఉంది. అప్పుడూ ఇప్పుడూ ప్రజల కోసం పనిచేస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్ష లకు అనుగుణంగా మంత్రి పదవిని తృణప్రాయంగా భావించి రాజీనామా చేశా.

ఆంధ్రజ్యోతి: ప్రభు త్వంలో మీదే 'కీ' రోల్ అంటున్నారు దీనిపై మీరేమంటారు.?

మంత్రి: ప్రజలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి మరెందులో ఉం డదు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం రోజుకు 18 గంటల పాటు పని చేస్తున్నా. ప్రభుత్వంలో ఏ నిర్ణయమైనా మంత్రివర్గం సమష్టిగా తీసుకుంటుంది. అలా ప్రజాప్రభుత్వం ముందుకు పోతోంది.

ఆంధ్రజ్యోతి: ఐటీ పరిశ్రమలశాఖ మంత్రిగా మీ ప్రాధాన్యత అంశాలేంటి?

మంత్రి: రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దేశంలోకెల్లా ఐటీకి హైదరాబాద్ బెస్ట్ ప్లేస్‌గా భావిస్తున్నారు. ఐటీ పరిశ్రమను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు సైతం విస్తరించడానికి కృషి చేస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటిలీజెన్స్ (ఏఐ) రంగానికి ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వం పని చేస్తుంది. యువతలో నైపుణ్యం, ప్రతిభ పెంచడానికి ఏఐని వినియోగించేందుకు కృషి చేస్తున్నాం. మంథని నియోజకవర్గంలో, భూపాలపల్లి జిల్లాలో ఐటీ పరిశ్రమ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నా.

ఆంధ్రజ్యోతి: పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు?

మంత్రి: ప్రభుత్వం పరిశ్రమలకు సంబంధించిన ప్రత్యేక పాలసీని తీసుకొచ్చింది. ఇటీవల సూక్ష్మ, చిన్న మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల అభివృద్ధికి పాలసీ తెచ్చి ముందుకెళ్తున్నాం. పలువురు పారిశ్రామిక వేత్తలు తమ పరిశ్రమల యూనిట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తున్నారు. పారిశ్రామిక వేత్తలు మౌళిక సదుపాయాలను కోరుకుంటున్నారు. దీని కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు వెచ్చించి పరిశ్రమలు, మౌళిక సదుపాయాల కల్పన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మంత్రి : ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి కట్టుబడి ఉంది. వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో, మంథని నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే తలంపుతో ఉన్నాం. ఆయిల్‌పామ్ సాగుకు రైతులకు ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు చేపడతాం. ఈ ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేలా కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: యువత కోసం మీ ప్రభుత్వం ఏం చేస్తోంది?

మంత్రి: యువత అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తూ టీటీఎల్ సహకారంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్పు చేసి రూ.కోట్లు నిధులను వెచ్చించి విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడానికి కృషి చేస్తున్నాం. దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక వేత్తలను కమిటీగా ఏర్పాటు చేసి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. దీంతో పరిశ్రమలకు కావాల్సిన అన్ని రకాల నైపుణ్యాలతో ఉన్న యువశక్తి అందుబాటులోకి రానుంది.

ఆంధ్రజ్యోతి: మంథని నియోజకవర్గ అభివృద్ధిపై మీ ప్రణాళిక?

మంత్రి: మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ఎళ్లవేళలా కృషి చేస్తా. మా కుటుంబంపై ప్రేమతో ఎనిమిదిసార్లు గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి ఎంత చేసినా తక్కువే. ప్రభుత్వం ఏర్పడ్డ పది నెలల కాలంలో సుమారు రూ.400 కోట్లతో వంతెన, రోడ్లు, భవనాల నిర్మాణ పనులు మొదలు పెట్టాం. రూ.125 కోట్లతో మంథని బ్రిడ్జి, రూ.80 కోట్లతో పెద్దపల్లి నుంచి మంథని వరకు రహదారి నిర్మాణం, రూ.60 కోట్లతో ధన్వాడ-దామెరకుంట, ఓడేడు-ఖమ్మంపల్లి రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. అలాగే, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ఈ నిర్మాణం కోసం బడ్జెట్‌లో రూ.300కోట్లు కేటాయింపు జరిగింది. ఇంకా వివిధ రంగాల అభివృద్ధిసంక్షేమం కోసం రూ.వందల కోట్లతో ప్రతిపాదనలు చేశాం. త్వరలోనే నియోజకవర్గంలో కాటారం, మంథని కేంద్రాలుగా పారిశ్రామిక పార్కుల ఏర్పాటు చేయనున్నాం.

ఆంధ్రజ్యోతి: మారుమూల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం మీ కృషి?

మంత్రి: అటవీశాఖ అధికారులు మానవీయ కోణంతో ఆలోచించాలి. మారుమూల ప్రాంతాలకు కనీస రవాణా సౌకర్యం కల్పించాలనే ఆలోచనతో ముందుకెళ్తుంటే అధికారులు సాధారణ ప్రజలను ముప్పు తిప్పలు పెట్టేలా చేస్తున్నారు. పోడు భూముల సాగుదారులకు ఇబ్బంది పెట్టొద్దని ఆదేశాలు ఇచ్చాం. ఉద్దేశ్య పూర్వకంగా ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారులపై శాఖాపరమైన చర్యలకు వెనుకాడేది లేదు. ఈ ప్రాంత అభివృద్ధికి ఏ శాఖ అధికారులైనా కావాలని ఆటంకం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

మేడారంలో 'మొక్క ముడుపు'

మేడారం, అక్టోబరు 8: తాడ్వాయి మండలంలోని మేడారంలో మంగళవారం మొక్క ముడుపు పండుగను పూజారులతో కలిసి పరిసర గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు ఆధ్వర్యంలో వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'వనదేవతలకు మాటిద్దాం, మొక్క ముడుపు చెల్లిద్దాం' అనే నినాదంతో గద్దెల ప్రాంగణంలో మొక్కలు నాటారు. జగ్గారావు మాటాడుతూ మేడారంలోని ప్రకృతిని కాపాడడానికి ప్రతి భక్తుడూ మేడారం పరిసర గ్రామాల్లో ప్రాంతాల్లో వనదేవతల ముడుపు మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు కొక్కెర రమేష్, జనార్దన్, యువజన సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



గద్దెల ప్రాంగణంలో మొక్క నాటుతున్న పూజారులు

పంట పరిహారం మంజూరు

భూపాలపల్లి జిల్లాకు రూ.18,33,750

కృష్ణకాలనీ (భూపాలపల్లి), అక్టోబరు 8: రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించనుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. భూపాల పల్లి జిల్లాలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6 వరకు భారీ వర్షా లు కురిశాయి. ఈ నేపథ్యంలో ప్రధానంగా భూపాల పల్లి జిల్లాలోని మహదేవపూర్, మల్హర్ మండలాల్లోని పంటలకు నష్టం వాటిల్లింది. ఈ రెండు మండలాల్లోనే పంట నష్టాన్ని అంచనా వేసిన వ్యవసాయశాఖ అధికా రులు ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. ఈ క్రమంలో 183 ఎకరాల 15 గుంటలకు నష్టపరిహారంగా 161 మంది రైతులకు మొత్తం రూ. 18,33,750 ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

ములుగు జిల్లాకు రూ.11.30 లక్షలు

ములుగు: భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిని, పొలాలు కోతకు గురై, ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్ట పోయిన జిల్లా రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. ఎకరాకు రూ.10వేల చొప్పున 147మంది రైతులకు రూ.11,30,500 మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈఏడాది ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6వరకు కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా 113.02 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నట్లు అధి కారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా నష్ట పరిహారం నిధులు మంజూరయ్యాయి. సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలలోకి ఈ మొత్తం నేరుగా జమ కానుంది.

వన్యప్రాణులను వేటాడిన ఆరుగురి అరెస్టు

ములుగు, అక్టోబరు 8: ములుగు మండలం జాకారం శివారులో అడవి పంది, మనుపిల్లిని వేటాడి హతమార్చిన ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి డోలి శంకర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడిచేసిన అటవీశాఖ సిబ్బంది పంది, పిల్లి కలేబరాలను మంటల్లో కాల్చుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఓర్సు కొము రయ్య, ఓర్సు పరుశురాములు, ముదంగుల రాజు, ఆలకుంట సోమయ్య, ఓర్సు రాజు, కొమురయ్యలు క్లచ్ వైర్‌లతో ఉచ్చు లను అమర్చి వన్యప్రాణులను వేటాడుతు న్నారని పేర్కొ న్నారు. నిందితులను అరెస్టు చేసి వారిపై వన్యప్రాణుల సం రక్షణ చట్టం కింద కేసు నమోదు చేయ డంతోపాటు వారు ఉపయోగించిన ఆటోను సీజ్ చేశామని తెలిపారు. ఈ దాడిలో జాకారం సెక్షన్ అధికారి మమత, బీట్ ఆఫీసర్ శ్వేత, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధుడు వెంకటేశ్వర్లు

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

వెంకటాపురం(నూగూరు), అక్టోబరు 8: బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరా డిన యోధుడు గుర్రం వెంకటే శ్వర్లు అని సీపీఎం జిల్లా కార్య దర్శి తుమ్మల వెంకటరెడ్డి కొని యాడారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గుర్రం వెంకటేశ్వర్లు వర్ధంతి మంగ ళవారం జరిగింది. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గుర్రం వెంక టేశ్వర్లు మండలంలో సీపీఎం ఎదుగుదలకు ఎంతో కృషిచేశారని అన్నారు. గిరిజనుల కోసం అనేక ఉద్య మాలు చేపట్టారని అన్నారు. పేదలు, బడుగు, బలహీ నవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు గుర్రం పుల్లారావు, దావూద్, వాసు, మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను, చారి, ఆదినారాయణ, రాములు, పుల్లారావు, నాగేశ్వర్‌రావు, మాణిక్యం, ప్రసాద్, కృష్ణ, రాము, శ్రీను, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్ పర్యటన

వాజేడు, అక్టోబరు 8: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మంగళవారం పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల రైతులు మరమ్మతులు చేసుకున్న వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారిని పరిశీలించారు. స్వచ్ఛందంగా రైతులు రోడ్డుకు మరమ్మతులు చేసుకోవడం అభినందనీయమన్నారు. అదే విధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరగా మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు వేసిన రోడ్డు పనులకు అడ్డుకోవడం సమంజసం కాదని తహసీల్దార్‌పై అసహనం వ్యక్తం చేశారు. మిమ్మల్ని ఎవరు ఆపమన్నాని నిలదీశారు. రోడ్లు గుంతలమయంగా ఉన్నప్పుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రావెల్ తోలుకుంటుంటే వారికి సహకరించాల్సి ఉండగా అడ్డుకోవడం ఏమిటని మండిపడ్డారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు విశ్వనాథ ప్రసాదబాబు రాజు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, నాయకులు వాసు, దుర్గారావు, ఖాజావలీ, చెన్నం ఎల్లయ్య, చెన్నం స్వామి తదితరులు ఉన్నారు.



వాజేడులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వెంకటాపురంలో..

- వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఏడు కుటుంబాలకు మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పెళ్లి చేసిన అర్హులైన ప్రతి కుటుంబం కళ్యాణలక్ష్మి పథకాన్ని పొందాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, నాయకులు మోహన్‌రావు, మన్నెం సునీల్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గిరివికాసం పథకంపై స్పష్టత ఇవ్వాలి

తాడ్వాయి, అక్టోబరు 8: సీఎం గిరివికాసం పథకంపై ఐటీడీఏ అధికారులు స్పష్టత ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఆశన్నగూడ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఐటీడీఏలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆదివాసీ రైతులు గిరివికాసం పథకం ద్వారా బోర్ల గురించి దరఖాస్తు చేసుకుంటున్నారని అన్నారు. పెసా గ్రామసభలో చెప్పిన ప్రకారం ఒకే దరఖాస్తు ఫారంగా మార్చారని, అందులో అధికారుల సంతకాలు చేయించి ఏటూరునాగారం ఐటీడీఏకు వెళ్తే ఆఫారం కాదు వేరే ఫారం అందించాలని సూచిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి రైతులు ఉంటేనే పథకం వర్తిస్తుందని అంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఆదివాసీ రైతులు ఈసం సునీల్, వట్టం నవీన్, రామ్మూర్తి, విష్ణు, సంభాషరావు, ఆదినారాయణ, నర్సయ్య పాల్గొన్నారు.

స్థలం కబ్జా చేయడం హేయం : ఎమ్మార్పీఎస్

మల్హర్, అక్టోబరు 8 : మానవత్వంతో చేరదీస్తే స్థలం కబ్జా చేయడం హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణిగుంట్ల కొమురయ్య ఆరోపించారు. రుద్రారంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేశ్వరి, రమాదేవి అనే మహిళలు రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న నారాయణరావు స్థలంలో కొట్టు పెట్టుకుంటామని ప్రాథేయపడగా మానవత్వంతో అవకాశం కల్పిస్తే ఆ స్థలం తమదేనని వారు దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల రాజు, నాయకులు ఇంజపెల్లి ప్రవీన్, వంగపల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల పరీక్షలు నిర్వహించాలి : డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 8: అసంక్రమిత వ్యాదులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు 30ఏళ్లలోపు ఉన్నవారందరికీ నిర్వహించాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. 30ఏళ్లలోపు ఉన్నవారందరికీ రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌కు సంబంధించి వాటి పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను ఎన్సీడీ, ఆయుష్మాన్‌భారత్ పోర్టల్‌లో పొందుపరచాలని డీఎంహెచ్‌వో అన్నారు. డాక్టర్ సత్యేంద్రనాథ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి పవన్‌కుమార్, జిల్లా పిల్లల ఆరోగ్యం ఇమ్యూనైజేషన్ అధికారి రణధీర్, కీటక జనిత టీబీ నియంత్రణ అధికారి భవ్యశ్రీ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి సంపత్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రేగొండ, అక్టోబరు 8: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి కలిశారు. భూపాలపల్లి జిల్లా రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి గురించి చర్చించారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో షైన భిక్షపతి, ఏకు రవికుమార్, కందుకూరి శీధర్, బీజేపీ నాయకులు పెండెల రాజు, ఆకుల రాజు, నేరెళ్ల శంకర్ ఉన్నారు.



బండి సంజయ్‌తో నిశీధర్‌రెడ్డి తదితరులు

కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 8: భూపాలపల్లి సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ రాహుల్‌శర్మ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. పూలను పూజించే సృంస్కృతి తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ అధికారి శైలజ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీత, మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



బతుకమ్మలు ఎత్తుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే, కలెక్టర్



బతుకమ్మ వేడుకల్లో ములుగు ఎస్పీ తదితరులు

భూపాలపల్లి ఎస్పీ కార్యాలయంలో..

కృష్ణకాలనీ (భూపాలపల్లి) : భూపాలపల్లిలోని ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు వైభంగా జరిగాయి. ఎస్పీ కిరణ్‌ఖరే సతీసమేతంగా హాజరయ్యారు. మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు తదతరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకలో భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు

ములుగు పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో..

ములుగు: ములుగులోని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఉయ్యాల పాటలు, కోలాట నృత్యాలతో ఆడిపాడారు. ఎస్పీ శబరీశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పల్లెలకు పైసలొచ్చినయ్..

7వ పేజీ తరువాయి

కేటాయించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీల్లోని ఖాతాల్లో ఈమొత్తం జమకాబోతుందని జిల్లా పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

కార్మికుల్లో ఆనందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,688 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 6,995 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీ ఆదాయన్ని బట్టీ కొంత మందికి 6 నెలల జీతం పెండింగ్‌లో ఉండగా, మరో కొంత మందికి రెండు, మూడు నెలల జీతం పెండింగ్ ఉంది వీరందరికీ కలిపి ప్రసుత్తం ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో నుంచి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు వేతనాలు అందజేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో కొంత కాలంగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న హనుమకొండలోని 1006 కార్మికులు, జనగామలో 1,209, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,033, మహబూబాబాద్ జిల్లాలో 1,781, ములుగులో 806, వరంగల్‌లో 1,160 మొత్తం కలిపి 6,995 మంది కార్మికులు దసరా పండుగ ముందు వేతనాలు అందుకోనున్నారు.

జిల్లాల వారీగా విడుదల చేసిన నిధులు

జిల్లా	జీపీల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
హనుమకొండ	208	2,75,05,217
వరంగల్	323	3,23,44,427
జనగామ	281	3,81,31,080
మహబూబాబాద్	461	5,37,24,129
జయశంకర్ భూపాలపల్లి	241	2,70,26,027
ములుగు	174	2,17,03,374

